ప్రజాశక్తి
గురువారం 3 అక్టోబర్ 2024
5
విజయనగరం

విద్యుత్తు భద్రతపై ఉద్యోగుల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విద్యుత్తు భద్రత ఆశాఖ ఉద్యోగులతో ఎపిఇపిడిసిఎల్ సూపరెండెంట్ ఇంజినీర్ ఎస్.లక్ష్మణరావు బుధవారం కార్యాలయం ఆవరణలో ప్రతిజ్ఞ చేయించారు. ఇక నుంచి తాను పని చేస్తున్న కార్యాలయ పరిధిలో విద్యుత్ ప్రమాదాల వల్ల గాయపడటం, ప్రాణం పోవు సంఘటనలు జరగకుండా ఉండటానికి త్రికరణశుద్ధిగా కృషి చేస్తానని ఉద్యోగులంతా ప్రతిజ్ఞ చేశారు. ఇఇ త్రినాధరావు, ఎడిఇ కిరణ్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యుత్తు ఉద్యోగులు

గాంధీ విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అంబేద్కర్,జెసి సేతు మాధవన్, ఎస్పి వకుల్‌జిందాల్, జిల్లాప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణ్ చక్రవర్తి

మహాత్ముల ఆశయాలు శిరోధార్యం

గాంధీ, లాల్ బహుదూర్‌శాస్త్రి జయంతి కార్యక్రమంలో కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశకి-విజయనగరంకోట

జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలు మనందరికీ శిరోధార్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని మహాత్ముని విగ్రహానికి, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు జాతికి చేసిన సేవలను శ్లాఘించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని పూలమాలలతో నివాళు లర్పించారు.

జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో గాంధీ జయంతిని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి ఎస్‌పి వకుల్ జిందాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. సమాజంలో శాంతియుత స్థాపనకు మహాత్ముడు చూపిన అహింసా మార్గం, సెక్యులరిజం అన్నవి ప్రతీ ఒక్కరూ ఆచరించాల్సిన మార్గాలన్నారు. మహాత్మా గాంధీని స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ ఒక్కరూ ఆయన చూపిన శాంతి మార్గంలో పయనించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి సౌమ్యలత, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..

విజయనగరం లీగల్ : గాంధీ జయంతి సందర్భంగా స్థానిక విటి అగ్రహారం పాత జిల్లా కోర్టు భవనంలో ఉన్న జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయం ఆవరణలో మహాత్మ గాంధీ విగ్రహానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ సందర్భంగా పాత జిల్లా కోర్టు భవనంలో మున్సిపల్ ఆఫీసు సిబ్బంది మరియు జిల్లా కోర్టు సిబ్బందితో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.దుర్గయ్య, సివిల్ జడ్జి తర్లాడ రాజేష్ కుమార్, జిల్లా కోర్టు సిబ్బంది పాల్గొన్నారు

డల్లాస్‌లో మంత్రి కొండపల్లి నివాళి

గత వారం రోజులుగా అమెరికాలో పర్యటనలో ఉన్న రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గాంధీ జయంతి సందర్భంగా డల్లాస్ లోనే గాంధీ విగ్రహాన్ని సందర్శించారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుతో కలిసి స్థానిక తెలుగు సంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడి దేశానికి స్వాతంత్రం తెచ్చిన మహానేత జాతిపిత మహాత్మా గాంధీ అని మంత్రి కొండపల్లి కొనియాడారు.

స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలి : ఎమ్మెల్యే

స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని టిడిపి పాలిట్ బ్యూరో సభ్యులు, మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. బుధవారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో గాంధీజి, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మహనీయులు ప్రాణాలు త్యాగం చేసి దేశానికి స్వాతంత్ర్యం సాధించారు. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి తరానిదని అన్నారు కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : గాంధీ జయంతిని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు మేయర్ వి.విజయలక్ష్మి, కమిషనర్ పి.నల్లనయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కార్యాలయ సిబ్బంది పాలొన్నారు.

గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అశోక్‌గజపతి, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

స్టీల్‌ప్లాంట్ రక్షణకు కార్మిక సంఘాల నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ ఉక్కు పరిశ్రమ ను ప్రైవేటీకరణ కాకుండా రక్షించాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, ఎఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బెహరా శంకర్ రావు, ఐఎఫ్‌టియు నాయకులు కె.అప్పలసూరి మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 32 మంది విద్యార్థుల ప్రాణ త్యాగాలతో, 67 మంది ఎంపీల రాజీనామాలతో, 30 గ్రామాల రైతుల 32వేల ఎకరాల భూముల త్యాగంతో సాధించుకున్నామని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమలో తయారయ్యే నాణ్యమైన ఉక్కును ప్రైవేటు ఉక్కు సంస్థలు ప్రజలకు ఎందుకు అందించలేకపోతున్నాయో సమాధానం చెప్పాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీరావేశంతో జగన్ ప్రభుత్వంపై విరుచుకుపడిన పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఇప్పుడు ఉక్కు పరిశ్రమలోని 4వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తుంటే ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఉద్యోగులను ఇతర రాష్ట్రాలకు బలవంతపు ట్రాన్స్‌ఫర్స్ చేస్తుంటే ఉద్దేశపూర్వకంగా మౌనం ఎందుకు వహిస్తున్నారో ఆంధ్రా ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. బిజెపి విధానాలను వంటబట్టించుకుని పాలిసున్న కూటమి ప్రభుత్వం ఆంధ్రా ప్రజలను మత ప్రాతిపదికన విడదీసేందుకే కల్తీ లడ్డు వ్యవహారాన్ని తెరమీదకు తీసుకువచ్చారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలుచేయలేక తిరుపతి వెంటేశ్వరస్వామిని అడ్డం పెట్టుకుని ప్రజల నెత్తిపై భస్మాసుర హస్తం పెట్టాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూస్తూ ఉరుకోరని, ఉద్యమాలతో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టివి రమణ, జిల్లా కార్యదర్శులు బి.సూర్యనారాయణ, ఎ.గౌరి నాయుడు, నగర కార్యదర్శి బి.రమణ, ఎఐఎఫ్‌టియు నాయకులు అప్పలరాజు, కె.గౌతమి, జి.సత్యారావు, కె.రాకేష్, సిఐటియు నాయకులు హరిబాబు, రాములు, శ్రీను, సూరిబాబు, సాయి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు

నిరసన దీక్షలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్

కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ సత్యాగ్రహ దీక్ష

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ ఉపాద్యాయులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన బుధవారం కలెక్టరేట్ వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో తగినంతమంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జిటి, పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేట్ చేయాలని, మున్సిపాలిటీలలో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులలో అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయులలో అర్హులైన వారిని అర్బన్ ఎంఇఒలుగా నియమించాలనీ, మున్సిపల్ టీచర్లకు జిపిఎఫ్ ఖాతాలు తెరిపించాలని కోరారు. మున్సిపల్ టీచర్ల బదిలీలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలు పరిష్కారం చేయకపోతే ఈనెల 17న డిఇఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. దీక్షలో జిల్లా గౌరవ అధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, కోశాధికారి చింతా భాస్కరరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక సబ్ ఎడిటర్ కె.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు డి.రాము, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, ఎన్ సత్యనారాయణ, సిహెచ్ తిరుపతినాయుడు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అల్లు శంకరరావు, సిపిఎస్ సబ్ కమిటీ కన్వీనర్ పి రాంప్రసాద్, విజయనగరం కార్పొరేషన్ యు టి ఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి లు ఎస్.వెంకటరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద సత్యాగ్రహ దీక్ష చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

సత్యాగ్రహ దీక్షలు

బొబ్బిలి : గాంధీ జయంతిని పురస్కరించుకుని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంఆర్‌సి కార్యాలయం సత్యాగ్రహ దీక్షలను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ విద్యారంగాన్ని కాపాడాలని, టీచర్స్ సమస్యలు పరిష్కరించాలని, మున్సిపల్ టీచర్లను విద్యాశాఖలో విలీనం చేసిన తరువాత ఉత్పన్నమయ్యే సమస్యలు పరిష్కరించాలని, దీర్ఘకాలికంగా కొనసాగుతున్న అనేక సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ దశలవారీగా జరుగుతున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆనెం శ్రీనివాస్, కృష్ణ దాసు మాష్టారు, పట్టణ శాఖ అధ్యక్షులు తేలు స్వామి నాయుడు, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు మహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

దుష్టపాలన పోవాలి : కాంగ్రెస్

విజయనగరం కోట : దేశంలో దుష్ట పాలన పోవాలని డిసిసి అధ్యక్షులు ఎం. విద్యాసాగర్ అన్నారు. బుధవారం గాంధీ జయంతి సదర్భంగా ఆయన విగ్రహానికి వినతి పత్రం అందిస్తూ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా దేశంలో విభజించు పాలించు అనే సూత్రంపై పరిపాలన సాగుతోందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పూడి శ్రీనివాసరావు, బంగారు నాయుడు, షరీఫ్, సుంకర సతీష్ ,ఎస్. శ్రీనివాసరావు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మద్యం, మత్తు మందును నివారించాలి

గాంధీ విగ్రహం వద్ద ఐద్వా నిరసన

ప్రజాశక్తిగీవిజయనగరం టౌన్

రాష్ట్రంలో మద్యం, మత్తు పదార్ధాలను నియంత్రించాలని, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ డిమాండ్ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలకు వ్యతిరేకంగా కలెక్టరేట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మద్యం నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్ధాలు,గ గంజాయి వంటి వాటి వల్ల రాష్ట్రంలో అనేక నేరాలకు యువత పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వమే మద్యం నియంత్రించే విధంగా, ప్రభుత్వమే మద్యం దుఖానాలు నిర్వహించాలన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువులు ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఐద్వా నాయకులు వి.లక్ష్మి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

హామీలు అమల్లో ప్రభుత్వం విఫలం

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వంద రోజుల కూటమి ప్రభుత్వంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని వైసిపి జిల్లా అధ్యక్షులు, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక జెడ్‌పి ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం కోసం గత వైసిపి ప్రభుత్వం పాలన సాగిందన్నారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి కుటుంబానికి ప్రజలకు అవసరమైన సేవలు అందించామన్నారు. సుపరిపాలన కోసం సచివాలయం వ్యవస్థను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. నేడు వంద రోజుల పరిపాలన పూర్తి చేసుకున్న కూటమి పాలనలో మంచి ప్రభుత్వం అనే నినాదంతో ప్రజలు వద్దకు వెళ్తున్నారని, వంద రోజులు దాటిందో లేదో ప్రజలు రోడ్డు ఎక్కుతున్నారని ఎద్దేవా చేశారు. ఉచిత ఇసుక విధానం వల్ల భవన నిర్మాణ కార్మికులు పనులు లేక రోడ్డు ఎక్కుతున్నారన్నారు. తమ ప్రభుత్వంలో స్టాక్ పొయింట్ పెట్టీ టన్ను రూ.700కి ఇచ్చామని, నేడు టన్ను రూ.1800 ఇచ్చినా దొరకని పరిస్తితి నెలకొందని అన్నారు. రైతులకు తాము ఎరువులు రైతు భరోసా కేంద్రాలు ద్వారా అందించామని నేడు ఎక్కడా ఎరువులు అందే పరిస్తితి లేదని అన్నారు. పింఛన్లను గతంలో ఐదు రోజులు వరకూ ఇచ్చేవారిమని ఇప్పుడు ఒక్క రోజులో ఇచ్చేసి తర్వాత పింఛన్లను ఇచ్చే పరిస్థితి లేదన్నారు. దీంతో పాటు చేతివాటం మొదలైం దన్నారు. నీటిలో పంట మునిగిన రైతులకు భరోసా లేకుండా పోయిం దన్నారు. యూరియా, డిఎపి, అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం బోజన పథకం పై పర్యవేక్షణ లేదన్నారు. ఇటీవలి ఎస్ కోట, బొబ్బిలిలో జరిగిన ఘటనలే దీనికి నిదర్శనమన్నారు. విద్యుత్ భారాలు మోపమని చెప్పి నేడు భారాలు వేసేందుకు సిద్ధమయ్యా రన్నారు. భోగాపురం విమానాశ్రయం పనులు నిర్దిష్ట సమయంలో కాంట్రాక్టు తీసుకొన్న ఎల్‌అండ్‌టి వారు చేస్తారని ప్రభుత్వం విమానాశ్రయం కోసం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఎద్దేవా చేశారు. మీ పర్యవేక్షణ ఉన్న లేకున్నా పనులు జరుగుతాయన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు నెక్కల నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలపై కలెక్టర్ సమీక్ష

మూడు రోజులపాటు లేబర్ హాలీడే ప్రకటించే అవకాశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ఉత్సవ నిర్వహణ కమిటీతో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తమ ఛాంబర్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి పండుగకు లక్షలాదిమంది వచ్చే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉండేందుకు, భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆ మూడు రోజులపాటు లేబర్ హాలీడే ప్రకటించాలన్న విషయంపై చర్చించారు. హోటళ్లు, సంస్థలు, షాపుల్లో పనిచేసే కార్మికులు, ఇతర ఉద్యోగులను కూడా ఉత్సవాల్లో భాగస్వాములను చేసే ఉద్దేశంతో ఆ మూడు రోజులపాటు సెలవు ఇవ్వాలని యోచిస్తున్నారు. ఆహార పదార్థాలకు ఇబ్బంది పడకుండా భారీ ఎత్తున ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై ఇంకా విస్తత స్థాయిలో చర్చించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అలాగే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పకడ్బంధీ చేయాలని అధికారులను కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ ఎస్‌డి అనిత, సిపిఒ పి.బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిపిఒ శ్రీధర్ రాజా పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు కృషి : కలెక్టర్

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి-విజయనగరంకోట/టౌన్

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. స్వచ్ఛత హి సేవ ముగింపు కార్యక్రమాన్ని ద్వారపూడి గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో కలెక్టర్ మాట్లాడుతూ, మహాత్మాగాంధీ గ్రామాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన ఆశయాలు మనకు శిరోధార్యమని అన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిశుభ్రతతోపాటు, గ్రామాల పరిశుభ్రతకు పాటుపడాలని కలెక్టర్ కోరారు. డిపిఒ శ్రీధర్ రాజా, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్, ఎంపిడిఒ చంద్రకళ, ఉప సర్పంచ్ వెన్ను శ్రీనివాసరావు మాట్లాడారు. స్వచ్ఛత హి సేవ ప్రాధాన్యతను, నిర్వహించిన కార్యక్రమాలను, పరిశుభ్రత ఆవశ్యకతను వివరించారు. గ్రామ పారిశుధ్య కార్మికులు ఆల్తి ఎర్రయ్య, కోరాడ కృష్ణ, బోను లక్ష్మణలను సన్మానించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ప్రత్యేక అధికారి అరుణకుమారి, తాహశీల్దార్ కూర్మనాధరావు, గ్రామ సర్పంచ్ వై.ఆదిలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పారిశుధ్య కార్మికులను సత్కరించిన కలెక్టర్,ఎమ్మెల్యే

గాంధీ జయంతి సందర్భంగా ఎన్‌సిఎస్ వద్ద ఆయన విగ్రహానిక కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. అనంతరం పరిసరాలను పరిశుభ్రంగా వుంచుతామని కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య,జనసేన నాయకులు పాలవలస యశస్విని, టిడిపి నాయకులు అవనాపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిపుత్రుల అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

వచ్చే ఐదేళ్ల కాలంలో గిరిజనుల సామాజిక ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన జాతీయ గ్రామ ఉన్నత అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో మౌళిక వసతులు అభివృద్ధి చేయడం, గిరిపుత్రులకు ఆర్థిక సాధికారత కల్పించడం, అందరికీ నాణ్యమైన విద్యావకాశాలను కల్పించడం, ఆరోగ్యకరమైన జీవన పరిస్థితులు కల్పించే దిశగా చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంపై రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జెసి సేతుమాధవన్‌తో కలసి ఆవిష్కరించారు.

పంచాయతీ రికార్డులు మాయం

- గుణుపూర్ పేట కార్యదర్శి నిర్వాకం
- అనుమతులు లేకుండా కొత్త రికార్డులు ఏర్పాటు
- 45 రోజుల తరువాత పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గుణుపూరుపేట సచివాలయంలో ముఖ్యమైన పంచాయతీ రికార్డులు మాయమైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ రికార్డులు పోవడానికి పంచాయతీ కార్యదర్శి బి.లక్ష్మణరావు నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. రికార్డులు పోయి రెండు నెలలు కావస్తున్నా పైఅధికారుల దృష్టికి తీసుకురాకపోగా, పంచాయతీ బాడీ అనుమతి లేకుండా మరో రెండు పుస్తకాలు కొత్తగా ఏర్పాటు చేసి తీర్మానాలు చేస్తున్నారు. సుమారు 45 రోజులు తరువాత కూడా పై అధికారులకు చెప్పకుండా కార్యదర్శి లక్ష్మణరావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో గుట్టుచప్పుడు కాకుండా రికార్డులు పోయినట్లు ఫిర్యాదు చేశారు. దొంగే.. దొంగ దొంగ అనే చందంగా ఈ వ్యవహారం కనిపిస్తుండటంతో మండలంలో చర్చనీయాంశమైంది.

గుణుపూరుపేట సచివాలయంలో 2021లో ఏప్రిల్‌లో సమావేశపు పుస్తకాన్ని, అజెండా పుస్తకాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వాటి మీద తీర్మానాలు చేస్తూ ఉండేవారు. ఆ రికార్డులను సచివాలయంలో ఉన్న బీరువాలో పెట్టి ఉంచేవారు. ఈ ఏడాది ఆగస్టు 17వ తేదీన తీర్మానం చేయడానికి ఆ రికార్డులను బీరువాలోని నుంచి తీయడానికి చూసేసరికి అందులో ఆ పుస్తకాలు లేవు. ఈ విషయాన్ని పై అధికారులకు చెప్పలేదు. కనీసం పంచాయతీ సర్పంచ్‌కు కూడా చెప్పకుండా కార్యదర్శి ఒక్కడే పోలీస్ స్టేషన్‌కు గత నెల 29వ తేదీన వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఎట్టకేలకు ఈ నెల ఒకటిన ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాథం ద్వారా ఎంపిడిఒకు రికార్డులు పోయినట్లు ఫిర్యాదు చేశారు. దీంతో రికార్డులు మాయమైన సంగతి బయటపడింది.

ఎవరి అనుమతీ లేకుండానే రికార్డులు

రికార్డులు మాయమైనప్పటి నుంచి పంచాయతీలో తీర్మానం కోసం పంచాయతీ బాడీ, ఇఒపిఆర్‌డి, ఎంపిడిఒ వీరి అనుమతి లేకుండా రికార్డుల ఇష్టానుసారంగా రాసి తీర్మానాలు చేసేస్తున్నట్లు తెలిస్తోంది. వాస్తవానికి రెండు నెలల క్రితం రికార్డులు మాయమైతే సంబంధిత కార్యదర్శి స్థానిక సర్పంచ్‌తో పాటు అధికారులకు కూడా వెంటనే సమాచారం ఇవ్వాలి. కానీ ఎవరికీ చెప్పకుండా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం పట్ల కార్యదర్శిపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయనే కావాలని రికార్డులను మాయం చేసి ఇలా నాటకం ఆడుతున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కార్యదర్శిపై గతంలోనూ ఆరోపణలు

లక్ష్మణరావు గ్రేడ్ 4 కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈయనపై చాలా ఆరోపణలు ఉన్నాయి. గతంలో డిపిఒ ఆఫీసులో పని చేసేవారు.. అప్పుడు బదిలీల్లో సుమారు 18 నుంచి 20 లక్షల రూపాయలు వసూలు చేశాడని ఆరోపణ ఉంది. దీంతో అప్పుడు బదిలీపై గుణుపూర్‌పేట కార్యదర్శిగా వచ్చేశారు. గతంలో పనిచేసిన వాలంటీర్లకు సచివాలయ సిబ్బందికి జీతాలు పెట్టేవాడు కాదని, వారిని నానా ఇబ్బందులు పెట్టేవారని వారందరూ మండల స్థాయి అధికారులకు విన్నవించుకున్న సందర్భాలూ ఉన్నాయి. తనకు అధికారులతో సంబంధం లేదని, ప్రజాప్రతినిధుల అండ దండలు ఉంటే చాలని కార్యదర్శి బహిరంగంగానే చెబుతున్నట్లు గ్రామస్తులతో పాటు తోటి ఉద్యోగులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఒకటి రెండు రోజుల్లో తాను ఇక్కడ నుంచి వేరే గ్రామానికి బదిలీపై వెళ్లిపోతున్నానని, తనను ఎవరూ ఏమీ చేయలేరని చెబుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

గుణుపూరుపేటలోని గ్రామ సచివాలయం

రికార్డులు పోవడం వాస్తవమే..

గునుపూర్‌పేట పంచాయతీ ఆఫీసులో రికార్డులు పోవడం వాస్తవమే. 45 రోజుల క్రితం రికార్డులు పోతే ఇప్పుడు నా దృష్టికి తీసుకురావడం తప్పే. అనుమతి లేకుండా మా దృష్టిలో పెట్టకుండా తీర్మానం రికార్డు ఏర్పాటు చేయడం కూడా తప్పే. కార్యదర్శి బి. లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదును ఎంపిడిఒకు పంపించాను. పై అధికారుల సూచనలు మేరకు చర్యలు తీసుకుంటాం.

- శంకర్ జగన్నాథం, ఇఒపిఆర్‌డి, డెంకాడ.

ఘనంగా ఫర్ ద పీపుల్ ట్రస్టు వార్షికోత్సవం

ప్రజాశక్తి - కొత్తవలస

మండల కేంద్రంలో తుమ్మికాపల్లి గ్రామంలో వినాయక నగర్ వద్ద ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ 12వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిలోవ సిఐ జి. గోవిందరావు, ట్రస్ట్ చైర్మన్ విశ్వనాధ హరికుమార్ మాట్లాడుతూ పెందుర్తి వెంకటాద్రి వాకర్స్ క్లబ్ సహకారంతో 42 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేశామన్నారు. గుహిక శ్రీ ఆద్య పుట్టినరోజు సందర్భంగా, కార్పొరేట్ లాయర్ రెడ్డి పవన్, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయ్ రమణ, రైల్వే ఎంప్లాయ్ గోకాడ శ్రీను, అడ్డూరి బంగారమ్మ, ట్రస్ట్ సభ్యుల సహకారంతో 500 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 25 మంది రక్తదానం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, ట్రస్ట్ జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రవి, ట్రెజరర్ శ్రవణ్ కుమార్, సభ్యులు నగేష్, గణేష్, త్రివేణి, బుజ్జి, నాని, సాయి, గోవిందరావు, మల్లేశ్వరరావు, వెంకటాద్రి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శేఖర్, ఉపాధ్యక్షులు కృష్ణ, సెక్రటరీ శేషగిరి, జాయింట్ సెక్రెటరీ వాసు, ట్రెజరర్ రాజు, వెంకటాద్రి వాకర్స్ వెంకటాద్రి వాకర్స్ క్లబ్ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు,

వృద్ధులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న సిఐ

కార్యదర్శికి వీడ్కోలు

జామి: మండలంలోని జట్టేటీవలస గ్రామ కార్యదర్శిగా పని చేసి, బదిలీలో భాగంగా రాంభద్రపురం గ్రామ కార్యదర్శిగా వెళుతున్న సూర్యకుమారికు వీడ్కోలు సభ నిర్వహించి, సత్కరించారు. బుధవారం గ్రామ సచివాలయ భవనంలో నిర్వహించిన గ్రామసభ అనంతరం గ్రామ పెద్దలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొని, కుమారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో చేసిన సేవలపై నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జి. రవికుమార్, టిడిపి నాయకులు శంకర్, గ్రామ పంచాయతీ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపిపి జన్మదిన వేడుకలు

డెంకాడ: టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు 59వ పుట్టినరోజు వేడుకలు మండలంలోని తన స్వగ్రామం అక్కివరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషుల మధ్య బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామంలో ఉన్న శివాలయంలో పూజలు నిర్వహించి అనంతరం తన ఇంటి వద్ద కార్యకర్తలు నాయకులు మధ్య భారీ కేక్ కట్ చేశారు. పలురు నాయకులు కార్యకర్తలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో టిడిపి రాష్ట్ర యువజన అధికారం ప్రతినిధి పతివాడ విద్యాసాగర్ నాయుడు, నాయకులు సురేష్, కూర్మారావ్, అప్పారావు, అప్పలనాయుడు, రామారావు, జిల్లా పార్టీ యాదవ సంఘం అధ్యక్షుడు ఆదిబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన

డెంకాడ: మాదక ద్రవ్యాలపై ప్రయాణికులకు ప్రజలకు స్థానిక ఎస్ఐ సన్యాసినాయుడు బుధవారం అవగాహన కల్పించారు. మండలంలోని అయినాడ జాతీయ రహదారి వద్ద ప్రయాణికులు ప్రజలతో మానవహారం ఏర్పాటు చేసి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం ప్రమాదకరమని జీవితం నాశనం చేసుకోవద్దు అని అన్నారు. యువతీ యువకులు వీటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకుముందు డి తాళ్లవలస గ్రామంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మురళి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బె'ధర' గొడుతున్నాయి..

- సలసల కాగుతున్న నూనె ధరలు
- ఉమ్మడి జిల్లాలో

నెలకు రూ. 5 కోట్లకు పైగానే భారం

ప్రజాశక్తి - విజయనగరం కోట

వంట నూనె లేకుండా ఆహార పదార్థాలు తయారీ తక్కువ. రుచికి సలసల కాగే నూనె వంటలతో పాటు ఉండాల్సిందే. ఇప్పుడు వాటి ధర వింటేనే వంటిళ్లు వణుకుతున్నాయి. రిఫైన్డ్ వంట నూనెలపై గతంలో ఎలాంటి పన్ను లేదు. కేంద్రం ఒక్కసారిగా వీటిపై దిగుమతి సుంకన్ని పెంచేసింది. దీంతో గత కొన్ని రోజులుగా స్థిరంగా ఉన్న ధరలు గతనెల 13వ తేదీ అర్ధరాత్రి నుంచి ఒక్కసారిగా లీటర్‌పై 20 రూపాయలకి పైగా పెరిగాయి. ఈ ప్రభావంతో ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్, పొద్దె తిరుగుడు నూనె ధరలు పెరిగి మంట పుట్టిస్తున్నాయి. సామాన్యుడి వంటింటి బడ్జెట్ గాడి తప్పించాయి. దీంతో సామాన్య ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కసారిగా పెరిగిన ధరలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ. 5కోట్లకు పైగా ప్రజలపై భారం పడినట్లు అంచనా వేస్తున్నారు.

దుకాణంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నూనె డబ్బాలు

ధరలు ఇలా పెరిగాయి..

ఈ నెల 13వ తేదీ వరకు పామాయిల్ లీటర్ ధర రూ.90 ప్రస్తుతం రూ.120కి ఎగబాకింది. సన్‌ఫ్లవర్ నూనె మొన్నటి వరకు లీటర్ రూ.110 ఉండగా.. ఇప్పుడది రూ.130కు చేరింది. సన్‌ఫ్లవర్ నూనెలు లీటర్ 20 రూపాయలు, పామ్ ఆయిల్ లీటర్‌కు 30 రూపాయలు చొప్పున పెరిగింది. దీంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ధర పెంపు ముసుగులో కల్తీలకు అవకాశం

మార్కెట్లో వంట నూనె ధరలు పెరగడం అక్రమార్కులకు వరమయ్యే అవకాశాలున్నాయి. విడి విక్రయాల పేరుతో కల్తీ నూనెను అంటగట్టే ప్రమాదం ఉంది. రోడ్డు పక్క నుండే అల్పాహారశాలలు, చిన్న హోటల్లు, మాంసాహార దుకాణాల నిర్వాహకులు ఎక్కువగా విడి నూనె కొనుగోలు చేస్తుంటారు. పట్టణాల్లో హోల్‌సేల్ ధరలకు విడిగా డబ్బాల్లో కొనుగోలు చేసి పల్లెల్లో విక్రయించే వ్యాపారులూ ఉన్నారు. పల్లెల్లో కిరాణా దుకాల్లోనూ ఈ తరహా అమ్మకాలు ఉంటాయి. ధరలు పెరిగిన నేపథ్యంలో నూనెలో కల్తీలకు పాల్పడే అవకాశం ఉంటుంది. ఈ విషయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాల్సిందే. అయితే కల్తీ నూనెల విక్రయాలపై దాడులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఇది మరింత విస్తృతంగా జరుగుతున్నట్లు తెలిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్తీ నూనెల విక్రయాలపై దాడులు చేసి వినియోగదారులకు కల్తీ లేని నూనె అందే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరతున్నారు.

సామాన్యులపై భారం ఇలా..

ఉమ్మడి విజయనగరం జిల్లాలో జనాభా: 24 లక్షలు
మొత్తం కుటుంబాలు: 7 లక్షలు
నూనె వినియోగం నెలకు సగటున: 25లక్షల లీటర్లు
లీటర్‌పై కనిష్టంగా పెంపు: రూ.20
రోజుకు పెరిగిన భారం: రూ. 1.67 లక్షలు
నెలకు మొత్తం భారం: రూ. 5కోట్లు

జాతీయస్థాయిలో 'సాధన'కు గుర్తింపు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేటకు చెందిన సాధన యువజన సంఘానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈ మేరకు బుధవారం రాజస్థాన్ జైపూర్‌లో జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్‌కి (63 సార్లు రక్తదాత) జాతీయస్థాయిలో ప్రశంసా పత్రాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ జాతీయ కార్యదర్శి డాక్టర్ అతుల్ గోయల్ అందజేశారు. దేశంలో రక్తదానంలో విశేష కృషి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం అభినందిస్తూ ఈ ప్రశంసా పత్రాన్ని ఇస్తుంది. మన రాష్ట్రం నుంచి సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గప్రసాద్ ఎంపికయ్యాడు. ఉత్తరాంధ్రలో అత్యవసర సందర్భాల్లో అరుదైన రక్త వర్గ అవసరమైన సందర్భాల్లో సాధన కచ్చితంగా స్పందిస్తున్నందుకు, ఎంతో మంది నూతన రక్త దాతలు తయారు చేస్తున్నందుకు సాధన యువజన సంఘంను అభినందించారు. ఇందులో భాగంగా సాధన యువజన సంఘం చేసిన రక్తదానాలు, అవగాహనపై ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తామని తెలిపారు.

మతతత్వ రాజకీయాలను అడ్డుకోవాలి

ప్రజాశక్తి- శృంగవరపు కోట

బిజెపి దేశంలోని అన్ని రాష్ట్రాలలో మతతత్వ రాజకీయాలను అవలంబిస్తుందని దీన్ని కచ్చితంగా అడ్డుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ గేదెల తిరుపతి అన్నారు బిజెపి అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకులతో కలిసి బుధవారం పట్టణంలోని దేవి కూడలిలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి మెమరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాదాల మణి బాబు, అనుమాల శెట్టి నానాజీ, జామి మండల సీనియర్ నాయకులు లెక్కల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మత్తుమందు వద్దు.. వ్యాయామమే ముద్దు

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

విజయనగరంలో భగత్‌సింగ్ ఫెస్ట్ సందర్భంగా జరిగిన జిల్లా స్థాయి బాడి బిల్డర్స్ పోటీల్లో 8 మంది వివిధ కేటగిరిలలో బహుమతులు పొందిన విషయం తెలిసిందే. బుధవారం బాడి ఫిట్నెస్ జిమ్‌లో జరిగిన అభినందన సభలో పాల్గొన్న బాడి బిల్డర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ జిమ్‌లో వ్యాయామం, బాడి బిల్డింగులో శిక్షణ వల్ల యువత గంజాయి, మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా ఆరోగ్యవంతులుగా తీర్చి దిద్ది, ఆరోగ్యాన్నికాపాడతా యన్నారు. యువతీ యువకులు నిత్యం వ్యాయామం చేయాలన్నారు. పోలీసు, మిలటరీ ఉద్యోగ అవకాశాలు కోసం వ్యాయామం ఎంతో దోహదం చేస్తుందన్నారు. క్రీడాకారులు మహాత్మా గాంధీ స్ఫూర్తితో, సమాజ సేవలో, రక్త దానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాడి బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, కోశాధికారి టి. శ్రీనివాసరావు, విజేతలు పాల్గొన్నారు.

విజేతలతో అసోసియేషన్ నాయకులు

స్టాపర్ బోర్డులు ఏర్పాటు

శృంగవరపుకోట: పట్టణంలో డివైడర్ల వద్ద జరుగుతున్న ప్రమాదాల నివారణకు 'మనమంతా సంస్థ సభ్యులు' స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేయడాన్ని సిఐ నారాయణమూర్తి అభినందించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇదే సంస్థకు చెందిన సభ్యులు పట్టణంలో ట్రాఫిక్ ఐలాండ్ పునర్నిర్మాణం పనులు కూడా జరిపించారని కొనియాడారు. యువత సేవా కార్యక్రమాల్లో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మనమంతా సంస్థ సభ్యులు డీకే నాయుడు, మద్ది కృష్ణ, వసంత సత్యారావు, షేక్ స్వామి, సురేష్, రాజు, కొలుసు కిరణ్, బాబూలాల్, అప్పలసత్యం, న్యాయవాది డబ్ల్యు.ఎన్. శర్మ పాల్గొన్నారు.

జ్యూట్‌మిల్లును వెంటనే తెరిపించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహాత్మా మీరైనా స్థానిక జ్యూట్ మిల్‌ను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. బుధవారం జరజాపుపేట గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలవ వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 4 నెలలుగా స్థానిక జ్యూట్‌మిల్ ముడి సరుకు కొరత పేరిట యాజమాన్యం మూసి వేసిందన్నారు. మిల్లు మూత బడడం వల్ల కార్మికులు ఉపాధి లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లు తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్‌కి ప్రజా సంఘాల తరపున విన్నవించుకున్నప్పటికీ నెలలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి మూతబడిన జ్యూట్‌మిల్‌ను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు కనకల పద్మనాభం, కార్మికులు గాడు అప్పారావు, హెచ్చర్ల అప్పారావు, తుమ్ము తాత, మద్దిల సన్యాసిరావు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతినిస్తున్న నాయకులు

ముగిసిన స్వచ్ఛత హి సేవ

ప్రజాశక్తి - వేపాడ

సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు అన్ని పంచాయతీల్లో నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమం బుధవారం ముగిసింది. చివర రోజున మండల కేంద్రంలో 'స్వచ్ఛభారత్ దివస్' కార్యక్రమం లో భాగంగా వేపాడ సచివాలయం నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు స్వచ్ఛత హి సేవ గురించి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ, జంగిల్ క్లియరెన్స్, వీధులు శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ, స్వచ్ఛభారత్ ఎంసిఒ పంచాయతీ కార్యదర్శి, టిడిపి నాయకులు గుమ్మడి భారతి, మెలిపాక రమణ, ఆదపరెడ్డి ముత్యాల నాయుడు, దువ్వార ఈశ్వరరావు, సచివాలయ, అంగన్వాడి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కోస్టల్ క్లీనప్ డ్రైవ్ నిర్వహణ

డెంకాడ: గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని చింతలవలస ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు భారీ ఎత్తున విశాఖ జిల్లా భీమిలి బీచ్‌లో కోస్టల్ క్లీనప్ డ్రైవ్ బుధవారం నిర్వహించారు. యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ పదార్థాలను తొలగించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్ షణ్ముఖరావు నేతృత్వంలోని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎన్సిసి క్యా డేటల ప్రత్యేక బృందంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన యూనివర్సిటీలో ఫ్లాష్‌మాబ్

విజయనగరం టౌన్ : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం అంబేద్కర్ జంక్షన్ నుంచి కోట జంక్షన్ వరకూ నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా, విద్యార్థులు సిబ్బంది శుభ్రతపై అవగాహన కల్పించేందుకు నాటక ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ డాక్టర్ బొంతు కోటయ్య, స్వచ్ఛతహి సేవ కోఆర్డినేటర్ డాక్టర్ డి. నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనం తరం పాతరేగ జెడ్‌పిహెచ్ స్కూల్ ప్రాంగణంలో శుభ్రపరిం చారు. కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ టి.వి. కట్టిమణి, ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్ పాల్గొన్నారు.

వేపాడ: చెత్తను సేకరిస్తున్న సిబ్బంది

నేరాలు ఘోరాలు

అత్యాచారం కేసులో నిందితుడికి 22 ఏళ్ల జైలు

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి పోలీసు స్టేషన్‌లో 2020లో నమోదైన అత్యాచారం కేసులో నిందితుడైన పాత బొబ్బిలి, ప్రసాద్ నగర్‌కు చెందిన డొంకాడ రమేష్‌కు విజయనగరం మహిళా కోర్టు కమ్ 5వ ఎడిజె కోర్టు జడ్జి ఎస్.పద్మావతి 22 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేలు జరిమాన విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. పాత బొబ్బిలి ప్రసాద్ నగర్ కాలనీకి చెందిన నిందితుడు డొంకాడ రమేష్ (44) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఒకామెపై ఇంటిలో ఒంటరిగా ఉన్న సమయంలో అత్యాచారానికి పాల్పడినట్లుగా వచ్చిన ఫిర్యాదుతో బొబ్బిలి పోలీసు స్టేషనులో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు డొంకాడ రమేష్ ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లుగా నేరం రుజువు కావడంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పు వెలువడిందని ఎస్‌పి ఒక ప్రకటనలో తెలిపారు

అప్పు ఇచ్చిన డబ్బులు అడిగినందుకు దాడి

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇంటి తనఖాపై ఇచ్చిన డబ్బులు తిరిగి అడిగినందుకు హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన పట్టణంలోని మెహర్ కాలనీలో చోటు చేసుకుంది. పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ తెలిపిన వివరాలు మేరకు మెహర్ కాలనీలో నివాసముంటున్న యామల గణేష్ నాయుడుకు ఇంటి తనఖాపై వంగపండు సత్యనారాయణ రూ.4.50లక్షలు అప్పు ఇచ్చారు. దీంతో గ్రౌండ్ ఫ్లోర్ లో సత్యనారాయణ కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. తనఖాపై ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకుండా పెద్దింటి గోపాలంకు ఆ ఇంటిని అమ్మివేయడంతో సత్యనారాయణ కోర్టును ఆశ్రయించాడు. గణేష్ నాయుడుకు బుధవారం కోర్టు ద్వారా నోటీసు ఇచ్చి దండోరా వేయడంతో పరువు పోయిందని భావించిన గణేష్ నాయుడు కత్తితో సత్యనారాయణపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. బాధితుని భార్య పార్వతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడుని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ చెప్పారు.

242 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి- బొబ్బిలి

అక్రమంగా మద్యం తరలిస్తున్నారని సమాచారం మేరకు బొబ్బిలి ఎస్ఐ ఆర్. రమేష్ తన సిబ్బందితో దాడి తల్లి గుడి వద్దకు చేరుకుని మోటార్ సైకిల్ పై రెండు ప్లాస్టిక్ సంచుల్లో రూ.37,200 విలువగల 242 మద్యం సీసాలను తరలిస్తున్న బొబ్బిలికి చెందిన వేగి సూరిబాబు అనే వ్యక్తిని పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని పినపెంకి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రం మెట్ట వలస గ్రామానికి చెందిన ఎద్దు వాసు (23) మోటార్ సైకిల్ పై పినపెంకి నుంచి బొబ్బిలి వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో వాసు రోడ్డుపై పడిపోవడంతో కుడి కాలు, కుడి కాలర్ బోను విరిగాయి. వెంటనే రాజాం కేర్ ఆసుపత్రికి 108లో తరలించారు. క్షతగాత్రుడు తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కొండలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

ఘనంగా గాంధీ జయంతి

బొబ్బిలి: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్ వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. వనమిత్ర ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులను ఇందిరమ్మకాలనీలో సత్కరించి వారి సేవలను కొనియాడారు. గాంధీ స్మారక నిధి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పట్టణ సిఐ కె.సతీష్‌కుమార్, గాంధీ స్మారక నిధి అధ్యక్షులు ఎం.విజయమోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోర్టు, సబ్ జైల్లో సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.మురళి మోహన్ కుమార్, సభ్యులు గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శృంగవరపుకోట: ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పట్టణంలోని గాంధీ పార్క్ ఆవరణంలో గల గాంధీ విగ్రహానికి, బాపూజీ సేవా సంఘం వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇంచార్జి వబ్బిన సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు, నాయకులు రెడ్డి వెంకన్న, కాపుగంటి వాసు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌కోట : గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

స్థానిక వివేకానంద విద్యాసంస్థలలో గాంధీ జయంతి సందర్భంగా డిగ్రీ విద్యార్థులు బుధవారం కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయని కళాశాల కరస్పాండెంట్ సిహెచ్ఆర్‌కె ప్రసాద్ బుధవారం తెలిపారు. వస్త్రధారణకు సంబంధించిన ప్రాముఖ్యతను వివరించారు.

బాడంగి: మండలంలోని ఎరుకుల పాకలు గ్రామంలో గాంధీ జయంతి సందర్భంగా ఎంపిటిసి పాలవలస గౌరు, సర్పంచ్ పార్వతి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

జామి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ సతీష్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. జామి బజారు సెంటర్‌లో గల విగ్రహానికి వైసిపి, టిడిపి నాయకులు పూల మాలలు వేసి, గాంధీ సేవలను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీదేవి, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, మాజీ జెడ్ పిటిసి బండారు పెదబాబు పాల్గొన్నారు.

డెంకాడ: స్థానిక మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి ఎంపిపి బంటుపల్లి వెంకట్ వాసుదేవరావు, వైస్ ఎంపిపి ఎన్నింటి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి పూల మాల వేసి నివాళు లర్పించారు. ఎపిఎస్‌పి బెటాలియన్ సిబ్బంది, డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న విగ్రహానికి పిఎసిఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం పూలమాలవేసి నివాళులర్పించారు.

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా స్కౌట్ యూనిట్, రుద్రమదేవి గైడ్‌యూనిట్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, స్కౌట్ మాస్టర్ పి.రమేష్, ఏ రవిశంకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, కమిషనర్ కె. అప్పల రాజు గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డైట్‌లో ఇంఛార్జి ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతి నాయుడు, అధ్యాపకులు మతా రామకృష్ణ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎంవి రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమా భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

సంతకవిటి: మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురం జగన్మోహన్ రావు పూల మాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపిడిఒ కార్యాలయం ఎదుట స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండలంలో పనిచేస్తున్న గ్రీన్ అంబసిడర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సిరిపరపు మంజు, ఎఒ రఘునాథచారి, ఎస్ఐ గోపాల్‌రావు, ఇఒపిఆర్‌డి పుష్పాంజలి, మండల అధికారులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. నాయుడు వలస పాఠశాలలో హెచ్ఎం జెసి రాజు ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

బొండపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి చల్ల చలం నాయుడు, ఎంపిడిఒ వైవి.రాజేంద్రప్రసాద్‌లు మహాత్ముని చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది గాంధీ కి ఘనంగా నివాళులు అర్పించారు. ఎం.కొత్తవలస, కెరటాం, చినతమ రాపల్లి, బొండపల్లి, బి.రాజేరు, నెలివాడ, బిల్లలవలస, ముద్దూరు, పంచాయతీలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

విజయనగరం: స్థానిక గురజాడ పాఠశాలలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, కరస్పాండెంట్ స్వరూప, ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు గాంధీజీ గొప్పతనం గురించి వివరించారు.

గంట్యాడ: గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రిల జయంతిని పురస్కరించుకుని మండలంలోని పెదమజ్జిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గింజేరు గ్రామానికి వెళ్లే రహదారిలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.సునీత, ఉపాధ్యాయులు దుర్గయ్య, రాంబాబు, తిరుపతి రావు, సురేష్ కుమార్, అప్పలస్వామి, నాగేశ్వర రావు, శివకుమార్, దేవుడమ్మ, శ్రీదేవి, కుమారి, పార్వతీ, సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : జనసేనపార్టీ కార్యాలయాల్లో మహాత్మా గాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రిల జయంతిని ఘణంగా నిర్వహించారు. జనసేన నాయకులు గురాన అయ్యలు, అవనాపు విక్రమ్,అవనాపు భావన కాళ్ల గౌరీ శంకర్ మహాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని పిలుపునిచ్చారు.

సత్య కళాశాలలో : సత్య డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, ఎన్ సి సి ఆఫీసర్ కెప్టెన్ ఎం సత్య వేణి, అధ్యాపకులు గాంధీచిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



సంతకవిటి : గ్రీన్ అంబాసిడర్లను సత్కరిస్తున్న జగన్మోహన్‌రావు

విజయనగరం : చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్

పూసపాటిరేగ: గాంధీ విగ్రహాన్నిఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి

గాంధీ చిత్ర పటానికి జెఎన్‌టియు ఇంచార్జి వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్. డి. రాజ్యలక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమములో టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఆవిష్కరించిన ఎమ్మెల్యే

పూసపాటిరేగ : గాంధీ జయంతి సందర్భంగా పూసపాటిరేగలో శ్రీసూర్యోధయ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పూసపాటిరేగ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ విగ్రహన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి బుధవారం ఆవిష్కరిచారు. ఈ సందర్భంగా తమకు ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి, కన్యాకాపరమేశ్వరి ఆలయం నిర్మాణానికి స్థలం కావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు జలపారి శివ, మండల కోఆర్డి నేటర్ జి. జమరాజు, నాయకులు బాలా అప్పలరాజు, శంకాబత్తుల సత్తిబాబు, కళాశాల డైరెక్టర్ బి. చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బలభద్రుని శ్రీను, ఉపాధ్యాక్షులు ఆకి తాతాజీ, కార్యదర్శి పూసర్ల మురళీ, తదితరులు పాల్గొన్నారు..

విజయనగరం కోట : కొత్తగ్రహారంలో గల రోటరీ దశిగి పేరాజు మ్యూజిక్ అకాడమీలో మహత్మ గాంధీ, లాల్ బహాదూర్ శాస్త్రి జయంతులు జరిగాయి. రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖర్ రావు, అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి, మహాత్మ గాంధీ, లాల్ బహాదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

లాల్ బహుదూర్ శాస్త్రి 120 జయంతిని బుధవారం అంబేద్కర్ జంక్షన్ వద్ద గల ప్రజా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి. దుర్గారావు బహూదర్ శాస్త్రి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అభివృద్ధి వేదిక నాయకులు పి. షణ్ముఖరావు, ఇఎస్ఎన్ రాజు, ఆలమూరు శ్రీను, బెల్లాపు బాబ్జీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నోటీసు
మహారాజశ్రీ విజయనగరం అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS 16/2022

Between :
శ్రీమతి దుగ్గపు రమాదేవి ....వాది
And :
శ్రీ ప్రగడ అప్పల సత్యం మరియు 12 మంది ఇతరులు ....ప్రతివాదులు

To
D5 శ్రీమతి కొన్ని లక్ష్మి, W/o వాసుదేవరావు, భోగాపురం గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా, ప్రస్తుత నివాసం :- మద్దిలపాలెం, విశాఖపట్నం.
D6 శ్రీమతి అట్టాడ పద్మ, W/o అట్టాడ సురేష్, భోగాపురం గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా, ప్రస్తుత నివాసం :- సోంపేట గ్రామం, శ్రీకాకుళం జిల్లా
D8 ప్రగడ వెంకటరమణ, S/o లేటు నారాయణమూర్తి, R/at D.No.2-173/3, కొత్తపాలెం, గోపాలపట్టణం, విశాఖపట్నం.
D11 బొడ్డ హరిబాబు, S/o కారుబాబు, భోగాపురం గ్రామం మరియు మండలం, విజయనగరం జిల్లా.

పబ్లిక్ నోటీసు

పై నెంబరు గల దావాలో మీపై వాదిగారు దావా వేసియున్నందున, సదరు దావా సమన్లు మీరు తీసుకోకపోవుట వలన కోర్టువారి ఆర్డర్ ప్రకారం పై నెంబర్ గల దావాలో దావా సమను అమలు చేయుటకు తేది 18-10-2024కి దావా నోటీసు నిమిత్తం వాయిదా వేసియున్నారు. కనుక యిందుమూలంగా ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయునది ఏమనగా పై నెంబరు దావాలో మీరు వాయిదా దినము అనగా **తేది 18-10-2024** నాడు మీరు స్వయంగా గాని, లాయరు గారు ద్వారా గాని పై కోర్టులో **ఉదయం గం॥ 10-30ని॥**లకు హాజరు అయి మీ తరుపున వాదన తెలియజేయవలసినదిగా యిందుమూలంగా తెలియజేయడమైనది. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

K.J.V.L.N.P. రత్నం(జ్యోతి)
న్యాయవాది, విశాఖపట్నం
సెల్: 9346300688